




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
జూలై 4, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-





## హోంశాఖలో 7 వేల ఉద్యోగాలకు గ్రీన్‌సిగ్నల్

- 5 వేల పోలీస్ పోస్టుల భర్తీకి ఉత్తర్వులు జారీ
- మరో 2 వేల పోస్టులకు త్వరలో అనుమతులు
- ఒకట్రెండు రోజుల్లో టీఎస్ఎల్‌పీఆర్‌బీ నోటిఫికేషన్
- పోలీస్, జైళ్లు, అగ్నిమాపక, ఎస్‌పీఎఫ్‌లో ఖాళీలు
- నియామక ప్రక్రియకు అధికారులు కసరత్తు పూర్తి

హైదరాబాద్: తెలంగాణ హోంశాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోలీస్, జైళ్లశాఖ, అగ్నిమాపకశాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్)ల్లో కలిపి దాదాపు 7 వేల పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా 5 వేల పోలీస్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన సుమారు 2 వేల పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు కూడా త్వరలో వెలువడనున్నాయి. వాటిలో ఎస్‌పీఎఫ్, జైళ్లశాఖ, అగ్నిమాపకశాఖల ఖాళీలు ఉండనున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు పూర్తికాగానే తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ)

(మిగతా 2వ పేజీలో)

# అప్పుల వివాదం.. లేఖల యుద్ధం

- 3వ రోజూ కొనసాగిన కాంగ్రెస్--భారాస సవాళ్లు
- జూపల్లి నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లకు బహిరంగ లేఖ
- అప్పుల లెక్కలతో ఎదురుదాడి చేసిన హరీశ్‌రావు
- ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన మంత్రి.. గైర్హాజరైన భారాస నేతలు
- ప్రభుత్వ అప్పుల గణాంకాలను వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస మధ్య కొనసాగుతున్న రాజకీయ పోరు మూడో రోజుకూ తగ్గలేదు. బహిరంగ చర్చల సవాళ్లతో ప్రారంభమైన ఈ వివాదం శుక్రవారం పరస్పర బహిరంగ లేఖలు, గణాంకాల యుద్ధంగా మారింది. ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఆర్థిక నిర్వహణపై విమర్శలు గుప్పిస్తూ తమ వాదనలకు మద్దతుగా లెక్కలను ప్రజల ముందుకు తీసుకొచ్చాయి. అప్పుల అంశంపై గతంలో ప్రకటించిన తన వైఖరిని పునరుద్ఘాటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావులకు బహిరంగ లేఖలు

(మిగతా 2వ పేజీలో)



## నేడు మిడ్జిల్‌కు సీఎం రేవంత్

- 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా పర్యటన
- మిడ్జిల్‌లో కృతజ్ఞత సభ.. అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఊర్కొండ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- వెల్జాలలో విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో విస్తృత పర్యటన
- సీఎం రాకకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్ : మహబూబ్‌నగర్-నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించనున్నారు. ప్రజాప్రతినిధిగా తన రాజకీయ జీవితానికి తొలి విజయాన్ని అందించిన మిడ్జిల్ మండలాన్ని సీఎం హోదాలో మరోసారి సందర్శించనుండడం ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది. 2006 జులై 4న మిడ్జిల్ జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించిన రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానానికి శనివారంతో ఇరవై సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, తనకు అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు 'కృతజ్ఞత వందన సభ' నిర్వహించనున్నారు. అదే సమయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజలు, శంకుస్థాపనలు చేసి ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపునివ్వనున్నారు. పర్యటనలో భాగంగా ముందుగా నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్న

(మిగతా 2వ పేజీలో)

## తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలర్ట్ 7రోజుల పాటు దంచికొట్టనున్న వర్షాలు



- హైదరాబాద్, అమరావతి వాతావరణ కేంద్రాల ఉమ్మడి బులెటిన్
- ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు
- తెలంగాణలోని ఉత్తర జిల్లాలకు భారీ నుండి అతి భారీ వర్ష సూచన
- ఏపీ తీరప్రాంతాలు, రాయలసీమలోనూ విస్తారంగా వర్షాలు

## హైదరాబాద్‌లో హోటళ్లకు మటన్ పేరుతో బీఫ్ సరఫరా.. ఇద్దరి అరెస్ట్!

- మటన్ పేరుతో బీఫ్ విక్రయం.. 50 కిలోల మాంసం సీజ్
- ఇద్దరిని అరెస్ట్ చేసిన సీసీఎస్, హెచ్-ఫాస్ట్ బృందాలు
- పలు హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



## హైదరాబాద్‌లో దారుణం: ఫ్రెండ్‌తో వీడియో కాల్ మాట్లాడుతూనే మహిళ ఆత్మహత్య

- హైదరాబాద్ హోటల్‌లో వివాహిత ఆత్మహత్య కలకలం
- స్నేహితురాలితో వీడియో కాల్ మాట్లాడుతూనే బలవన్మరణం
- మరో వ్యక్తితో కలిసి హోటల్‌లో గది తీసుకున్న మహిళ
- ఇది ఆత్మహత్య కాదు హత్యేనని కుటుంబ సభ్యుల ఆరోపణ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు





## పాపికొండల విహార యాత్రకు గ్రీన్ సిగ్నల్.. 20 రోజుల తర్వాత పునఃప్రారంభం

- 20 రోజుల విరామం తర్వాత తిరిగి ప్రారంభంకానున్న పాపికొండల యాత్ర
- సాంకేతిక లోపంతో నిలిచిపోయిన విహార యాత్రకు అధికారుల గ్రీన్ సిగ్నల్
- తనిఖీల అనంతరం 15 ప్రైవేట్, ఒక ఏపీటీడీసీ బోటుకు అనుమతి
- శనివారం నుంచి గండి పోచమ్మ ఆలయం వద్ద నుంచి సేవలు పునఃప్రారంభం

# ఖమేనీ అంతిమయాత్ర ప్రారంభం

- టెహ్రాన్‌లో నివాళులర్పించిన దేశ విదేశీ ప్రతినిధులు.. భారత్ తరఫున గవర్నర్, కేంద్రమంత్రి నివాళి
- 7 రోజుల పాటు ఐదు నగరాల్లో కార్యక్రమాలు.. కుటుంబసభ్యుల భౌతిక కాయాలనూ పక్కనే ఉంచిన ఇరాన్
- జూలై 9న మషహద్‌లో ఖననం చేయనున్న అధికారులు.. అంతిమ వీడ్కోలుకు భారీగా తరలివస్తున్న ప్రజలు

టెహ్రాన్: ఇరాన్ దివంగత సుప్రీం నేత ఆయతొల్లా అలీ ఖమేనీకి సంబంధించిన అంత్యక్రియల కార్యక్రమాలు శుక్రవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. రాజధాని టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా మసీదులో ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచగా, దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, మతపెద్దలు, వేలాది మంది ప్రజలు నివాళులర్పించారు. ఖమేనీకి తుది వీడ్కోలు పలికేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. భారత్ తరఫున బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్‌తో పాటు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి

(మిగతా 2వ పేజీలో)





## వేసవి సెలవులు ముగిసినా.. తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

- దేశం నలుమూలల నుంచి తిరుమలకు భారీగా తరలివస్తున్న భక్తులు
- టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి 12 గంటల సమయం
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 66,304 మంది భక్తులు

## పాలకుర్ల వారి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన - తండ బ్రదర్స్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఎన్ టీవీ రిపోర్టర్, శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ పాలకుర్ల యాదయ్య గౌడ్( సూర్య) -బాలమణి దంపతుల కుమార్తె జ్యోతిర్మయి- సతీష్ గౌడ్ వివాహ వేడుక శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖ వ్యాపారవేత్త తండ నరసింహ గౌడ్, తండ వెంకటేష్ గౌడ్( ఢిల్లీ) బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొండ గిరి గౌడ్, మద్దెల రామనర్సయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు

## పేదల ఆరోగ్యానికి ఎంత ఖర్చయినా భరిస్తాం: కె ఎల్ ఆర్

### ---ప్రభుత్వానికి భారమైనా సీఎం రేవంత్ వెనకడుగు వేయరు



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 03 :- పేదల ఆరోగ్యానికి భద్రతగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.శుక్రవారం మహేశ్వరం మండలం అమీర్పేట్ గ్రామానికి చెందిన కొండపల్లి మహేష్ కు 60 వేల రూపాయలు చెక్కు అందజేసిన మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య ఈ సందర్భంగా ఆవుల యాదయ్య మాట్లాడుతూ ప్రతి పేదవాడు అనారోగ్యంతో కుటుంబ బాధపడుతున్న వాళ్లకు సీఎం రిలీఫ్ ఫండ్ సంజీవిని ఇస్తున్న వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన అమీర్పేట్ గ్రామస్తులు

## ఏ టూ జెడ్ సెలూన్ ప్రారంభించిన కొలను శంకర్ రెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 03 :- మీర్పేట్ బాలాపూర్ చౌరస్తా లోని ఎస్ ఎల్ ఎన్ కాలనీ లో నూతనం గా ఏర్పాటు చేసిన ఏ టూ జెడ్ సెలూన్ ను మాజీ కార్పొరేటర్లు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ తో కలిసి ప్రారంభించిన బిజెపి రాష్ట్ర నేత మాజీ సింగల్ విండో చైర్మన్ కోలన్ శంకర్ రెడ్డి ఈ కార్యక్రమములో షాపు యజమానులు బాబర్, అక్బర్ మరియు నేతలు కొత్త రాజేష్ రెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు

## 'ఎన్నికలు వద్దు.. విలీనమే ముద్దు'పై జూలై 6న రౌండ్ టేబుల్ సమావేశం





సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 3 : తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ కార్మిక సంఘమైన బహుజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో "ఎన్నికలు వద్దు -- విలీనమే ముద్దు" అనే అంశంపై జూలై 6న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది.ఈ సమావేశం జూలై 6 (సోమవారం) మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో జరగనుంది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయడం, గత ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ చట్టం నంబర్--7 (2023) ను పూర్తిస్థాయిలో అమలు చేయించడం, కార్మికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం ఉమ్మడి కార్యాచరణ రూపొందించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని నాయకత్వం తెలిపింది.బహుజన వర్కర్స్ యూనియన్ ఈ ఏడాది జూన్ 21న తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ కార్మిక సంఘంగా ఏర్పాటై, "సంపూర్ణ ఉద్యోగ భద్రతతో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలి" అనే లక్ష్యంతో ఉద్యమాన్ని కొనసాగిస్తోందని పేర్కొంది. కార్మికుల భవిష్యత్తు, సంస్థ అభివృద్ధి దృష్ట్యా అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు ఈ సమావేశానికి హాజరై ఐక్య కార్యాచరణకు సహకరించాలని రాష్ట్ర అధ్యక్షుడు సాజిద్ మహమ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ సంయుక్తంగా కోరారు.

## రంగారెడ్డి జిల్లా నూతన కాంగ్రెస్ కమిటీ పదాధికారులకు అభినందనలు

### -- మహేశ్వరం నేతలతో మర్యాదపూర్వక భేటీ



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 03 :- మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల శుక్రవారం మర్యాదపూర్వక భేటీ అయ్యారు ఈ సందర్బంగా రంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో పుట్టగల జగన్ (రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్) ఢిల్లీ శ్రీధర్ (రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ) గుల్షన్ (రంగారెడ్డి జిల్లా స్పోక్స్ పర్సన్) నియమితులైన సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని మరియు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది నూతన పదాధికారులకు శాలువాలు కప్పి, హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లాతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉంటూ పార్టీ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలని ఈ సందర్భంగా వారు నూతన నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

## ఇరాన్-అమెరికా యుద్ధానికి తెర?..

# పాక్ ద్వారా కొత్త శాంతి ప్రతిపాదన!



మార్చుకుంటున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. మరోవైపు అమెరికా పంపిన శాంతి ప్రతిపాదనకు తాము స్పందించామని ఇరాన్ నేడు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య సందేశాల మార్పిడి జరుగుతోందని తెలిపింది. అయితే, అమెరికా డిమాండ్లు మితిమీరి ఉన్నాయని ఇరాన్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించకపోవడం, ఇరాన్ కేవలం ఒకే ఒక్క అణు కేంద్రాన్ని కలిగి ఉండాలనేవి అమెరికా ప్రధాన డిమాండ్లలో ఉన్నాయని ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ స్పందించారు. "మా ఆందోళనలను అమెరికా దృష్టికి తీసుకెళ్లాం. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో చర్చలు జరుగుతున్నాయి" అని ఆయన మీడియా సమావేశంలో తెలిపారు. ప్రస్తుతానికి యుద్ధాన్ని ముగించడంపైనే తమ పూర్తి దృష్టి ఉందని, ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన సంకేతాలిచ్చారు.

**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

ఈ చర్చలు కొనసాగుతుండగానే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిన్న ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "ఇరాన్‌కు సమయం మించిపోతోంది. వారు వేగంగా కదలాలి, లేదంటే ఏమీ మిగలదు. సమయం చాలా కీలకం!" అని తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. అలాగే, ఫార్చ్యూన్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. "ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ ఆరాటపడుతోంది. కానీ, వారు ఒక ఒప్పందం చేసుకుని, ఆ తర్వాత దానికి ఏమాత్రం సంబంధం లేని పత్రాలను పంపిస్తారు" అని అసహనం వ్యక్తం చేశారు. ఇరాన్‌తో యుద్ధం ముగిసే వరకు వడ్డీ రేట్ల కోతపై నిర్ణయం కోసం వేచి ఉండాల్సి రావచ్చని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న శాంతి ప్రయత్నాలు ఫలించి, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయో లేదో వేచి చూడాలి.

## కాళేశ్వరం అంత్య పుష్కరాలకు 3,360 బస్సులు.. ఛార్జీలు పెంచుతున్నట్లు ఆర్టీసీ వెల్లడి

**ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు సరస్వతి అంత్య పుష్కరాలు**

**రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు**

**ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను పెంచుతున్నట్లు రీజినల్ మేనేజర్ వెల్లడి**

**మహాలక్ష్మి ప్రయాణికులకు ఉచిత ప్రయాణం ఉంటుందన్న రీజినల్ మేనేజర్**




హైదరాబాద్ : కాళేశ్వరంలో నిర్వహించనున్న అంత్య పుష్కరాలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 3,360 బస్సులతో 5,772 ప్రత్యేక ట్రిప్పులను నడపనున్నారు. ఈ మేరకు వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 1 వరకు గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమక్షేత్రమైన కాళేశ్వరంలో పుష్కరాలు జరుగుతున్నాయని, ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక రవాణా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 5,772 ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. హన్మకొండ, వరంగల్ 1, వరంగల్ 2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ డిపోల నుంచి కాళేశ్వరానికి 59 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. హన్మకొండ బస్టాండ్ నుంచి మరిన్ని ప్రత్యేక బస్సులు ఉంటాయని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను పెంచుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు 50% అదనంగా వసూలు చేస్తామని అన్నా రు. మహాలక్ష్మి ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని అన్నారు.

## ఆలయ పూజారుల జీతాలపై పిల్.. విచారణకు సుప్రీంకోర్టు నో

ప్రభుత్వ నియంత్రణలోని ఆలయ పూజారుల
జీతభత్యాలపై దాఖలైన పిల్ తిరస్కరణ

ఈ విషయంలో
జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు
పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ అనుమతి

పూజారులను ఉద్యోగులుగా
గుర్తించాలని పిటిషన్‌లో అభ్యర్థన



దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సేవాదార్లు, ఇతర సిబ్బందికి ఏకరీతి వేతనాలు, సంక్షేమ ప్రణాళికను రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే... న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ ఈ పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ ఆధీనంలోని ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సిబ్బంది వేతనాలు, సేవా నిబంధనలను సమీక్షించేందుకు జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. వేతనాల కోడ్ 2019లోని సెక్షన్ 2(కే) ప్రకారం పూజారులను, ఆలయ సిబ్బందిని 'ఉద్యోగులు'గా గుర్తించి, వారికి కనీస వేతనం, ఇతర కార్మిక సంక్షేమ రక్షణలు కల్పించాలని అభ్యర్థించారు. ప్రభుత్వాలు ఆలయాలపై పరిపాలన, ఆర్థిక నియంత్రణ చేపట్టినప్పుడు ప్రభుత్వానికి పూజారుల మధ్య యజమాని-ఉద్యోగి సంబంధం ఏర్పడుతుందని పిటిషనర్ వాదించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో పూజారులు, సిబ్బంది కేవలం రూ.1,000 నుంచి రూ.5,000 మధ్య ఉన్న నామమాత్రపు గౌరవ వేతనాలు, దక్షిణలపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి పెన్షన్, ఆరోగ్య సంరక్షణ వంటి సామాజిక భద్రత కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఆలయాల నియామకాలు, ఆదాయంపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటూ, అక్కడి సిబ్బందికి కార్మిక సంక్షేమ ప్రయోజనాలు నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని ఆయన వాదించారు. అయితే, ధర్మాసనం ఈ పిల్ విచారణకు విముఖత వ్యక్తం చేయడంతో సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు స్వేచ్ఛనిస్తూ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇవ్వాలని అశ్విని ఉపాధ్యాయ్ కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది. పిటిషనర్ ఉపసంహరించుకున్న కారణంగా ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్.. ఇక ప్రయాణం సుఖమయం

**హైదరాబాద్ మెట్రోకు 60 కొత్త కోచ్‌లు**

**ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ కీలక నిర్ణయం**

**బెంగళూరు బీఈఎంఎల్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం**


**15 నెలల్లో కోచ్‌ల సరఫరాకు సంస్థ హామీ**

**పెరగనున్న రైళ్ల ఫ్రీక్వెన్సీతో ప్రయాణికులకు ఊరట**



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎల్బీనగర్ - మియాపూర్, నాగోల్ - రాయదుర్గం మార్గాల్లో రైళ్లలో నిలబడటానికి కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే అదనపు కోచ్‌ల కొనుగోలు అనివార్యంగా మారింది. ఆర్డర్ ఇచ్చిన నాటి నుంచి కేవలం 15 నెలల వ్యవధిలోనే కొత్త కోచ్‌లను సరఫరా చేస్తామని బీఈఎంఎల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. గతంలో రద్దీని అధిగమించేందుకు నాగ్‌పూర్ మెట్రో నుంచి కొన్ని కోచ్‌లను లీజుకు తీసుకోవాలని ప్రయత్నించినా, సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కోచ్‌ల కొనుగోలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో బీఈఎంఎల్‌కు ఆర్డర్ ఇచ్చే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 2015లో సుమారు రూ.1800 కోట్లతో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ రొటెమ్ సంస్థ నుంచి మెట్రో కోచ్‌లను కొనుగోలు చేశారు. ఇప్పుడు కొత్త కోచ్‌ల తయారీ కోసం హ్యుందాయ్ తమ సాంకేతికతను బీఈఎంఎల్‌కు బదిలీ చేసేందుకు అంగీకరించింది. దేశంలోని అనేక మెట్రో ప్రాజెక్టులకు విజయవంతంగా కోచ్‌లను సరఫరా చేసిన అనుభవం బీఈఎంఎల్‌కు ఉంది. ఈ 60 కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే, రద్దీ మార్గాల్లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో పాటు ప్రయాణికులకు సీటింగ్ సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఫలితంగా మెట్రో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, సుఖవంతంగా మారనుంది.

## మేడ్చల్ డిపిఆర్ఓ వేధింపులపై కలెక్టర్ కు ఫిర్యాదు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, వార్తా మిర్రర్, జూలై 03 : మేడ్చల్ మల్కాజిగిరి డిపిఆర్ఓ స్వర్ణలత విలేకరుల పట్ల కక్ష సాధింపు చర్యలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు శుక్రవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అక్రిడిటేషన్ కమిటీ విషయంలో, అక్రిడిటేషన్ల జారీ విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదుల పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కమిటీ నియామకంలో ఒక సామాజిక వర్గానికి, ఒక యూనియన్ కు అధిక ప్రాధాన్యతనిస్తూ కమిటీని నియమించారని వివరించారు. కమిటీ నియామకంపై అనేక దినపత్రికలలో వార్తా కథనాలు ప్రచురితమయ్యాయని వారు తెలిపారు. ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో విలేకరులపై కక్ష సాధింపు చర్యలతో పాటు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. లేనిపోని నిబంధనల పేరుతో జర్నలిస్టులను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులు 252 ప్రకారమే “అర్హత ఉన్న పత్రికలు మాత్రమే వారి ప్రతినిధులను అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేయించారని వారు అన్నారు. ఇలాంటి వారికి సైతం అక్రిడిటేషన్ల ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇప్పటికే మంజూరైన అక్రిడిటేషలను సైతం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. బస్సు పాసులను సైతం అప్రూవ్ చేయకుండా కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని వారు వివరించారు. కనీస పరిజ్ఞానం లేకుండా పత్రికలకు ప్రకటనలు జారీ చేయడం వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తన లోపాలను ఎత్తి చూపిన వారిపై ద్వేషం పెంచుకొని కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని వారు వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు సమీపంలోని అతిపెద్ద జిల్లాకు సమర్థులైన డిపిఆర్ఓ ను నియమిస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మరింత ప్రచారం లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయాలపై విచారణ జరిపి డిపిఆర్ఓ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను కలిసిన- సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధియాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం జేతురాం తండ గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ గారు ట్రైకాస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ గారిని కలవడం జరిగింది,సంతోష్ నాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని, తండాల అభివృద్ధి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని, సబ్సిడీ నిధులు విడుదల చేయాలని, గతంలో అనేక పెండింగ్ నిధులు అలాగే ఉన్నాయి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు, ఇండస్ట్రియల్ డిపార్ట్మెంట్ ని ప్రోత్సహించాలని, నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలని కోరారు, ఈ కార్యక్రమంలో లావుడియా శ్రీను నాయక్, భూక్య శ్రీను, తదితరులు పాల్గొన్నారు



## మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం - ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి, జూలై 3 వార్త మిర్రర్ ప్రతినిధి:-

ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలకొండపల్లిలో జూలై 4 నుంచి నిర్వహించనున్న మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రధాన కార్యనిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆహ్వానాన్ని స్వీకరించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే ఇటువంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరం విజయవంతం కావాలని, ఎక్కువ మంది ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మాజీ పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు భూపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, యాట నరసింహ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, సీనియర్ నాయకుడు సురభి వెంకటేశ్వర్ రావు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కుంచె సాయి కిరణ్ గౌడ్ నియామకం



ఎల్బీనగర్, 3 జూలై :వనస్థలిపురం డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుంచె సాయి కిరణ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సెక్రెటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా టీ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు మధుయాష్కి గౌడ్ సహకారంతో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మధు యాష్కి తనకు ఈ నియమా నియామకాన్ని అందించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేసి, కార్యకర్తలని బలోపేతం చేస్తానని తన నియామ కానికి సహకరించిన ప్రతి ఒక్కరికిఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మెరిట్ విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత..

ముఖ్య అతిథిగా పాల్గొన్న మిరియాల ప్రీతమ్....



చందానగర్ వార్త మిర్రర్ : ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించే ప్రతి కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ తెలిపారు. శ్రీకృష్ణ దేవరయ కాపు సంఘం ఆధ్వర్యంలో చందానగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, 18 మంది మెరిట్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం మొత్తం రూ.1,18,000 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ..విద్యే సమాజ ప్రగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదని, అలాంటి విద్యార్థులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి చేయూత అందిస్తున్న శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సాంబశివరావు, విష్ణుమూర్తి, సత్తిబాబు, ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఓయూలో ఓజస్ ఫ్లాష్ మాబ్

### -ఆర్ట్స్ కళాశాల ముందు విద్యార్థుల నృత్యాలతో ఓజస్ ప్రారంభ సంకేతం







సికింద్రాబాద్, వార్త మిర్రర్ జులై 3...ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈనెల 7, 8 తేదీల్లో “ఓజస్ 2ఖ26 “ పేరుతో నిర్వహించనున్న “కల్చరల్- అకాడమిక్ ఫెస్ట్ “ ను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు కళాశాల ఆవరణలో “ ఓజస్ ఫ్లాష్ మాబ్ “ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ పాటలు- సంగీత ధ్వనుల మధ్య చేసిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. అధ్యాపకులను ఉత్సాహపరచగా, యువతను ఉరకలెత్తించాయి. అలాగే “ఓజస్ ఫ్లాష్ మాబ్ “ కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ కళాశాల ముందు భారీ బెలూన్ ను ఆవిష్కరించారు. ఆర్ట్స్ కళాశాల పై నుంచి కింది వరకు వేలాడుతున్న భారీ “ ఓజస్ 2ఖ26 “ ఫ్లెక్సీలను ఇరువైపులా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ ఓజస్ అంటే వెలుతురు- కాంతి అనే అర్థం అని చెప్పారు. విద్యార్థుల ఆలోచనల్లో , వారు చేసే పనుల్లో, వారి జీవితాల్లో వెలుగులు ఉండాలని కోరుతూ “ఓజస్ 2ఖ26” కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. సృజనాత్మకతను, ప్రతిభను కనబరచడానికి విద్యార్థులకు ఇదొక చక్కటి వేదిక అని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన యు జి సి అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ బి. లావణ్య మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాల చరిత్రలోనే మొదటిసారిగా జరుగుతున్న “ఓజస్ 2ఖ26” కార్యక్రమం ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కూడా పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. స్వాతి, ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మాయ దేవి, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సి .ఎస్ స్వాతి, లైబ్రరీ సైన్స్ హెడ్ ప్రొఫెసర్ వివేకవర్ధన్, మరాఠీ హెడ్ ప్రొఫెసర్ నర్మదా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివానంద్ యాలాల, విద్యార్థులు పాల్గొన్నారు.

# లచ్చమ్మగూడెంలో కేంద్ర నిధుల దోపిడీ..

### అధికార కాంగ్రెస్ పక్షపాత రాజకీయంపై బీజేపీ వార్డు మెంబెర్స్ ఆగ్రహం!




సంస్థాన్ నారాయణపూర్ జూలై03 ( వార్త మిర్రర్) నారాయణపురం మండలంలోని లచ్చమ్మగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం తీవ్ర వివాదానికి దారితీసింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకం నిధులను వాడుకుంటూ, స్థానిక సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ నాయకులు, కాంట్రాక్టర్లు తో కుమకై తామేదో సొంత డబ్బులతో పనులు చేస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్నారని స్థానిక ప్రతిపక్ష నేతలు మరియు గ్రామస్థులు మండిపడుతున్నారు. కనీసం తీర్మానం కాపీలో రోడ్డు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వేస్తున్నారనే స్పష్టత కూడా లేదని, ఈ పనుల్లో దాదాపు రూ. 5 లక్షల నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. వార్డు మెంబర్లను డమ్మీలను చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల ఓట్లతో గెలిచిన వార్డు మెంబర్లకు లచ్చమ్మగూడెం గ్రామంలో కనీస గౌరవం దక్కడం లేదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం గ్రామసభలు నిర్వహించి ఎక్కడ రోడ్డు అవసరమో నిర్ణయించాల్సి ఉండగా, వాటిని పక్కనబెట్టి కాంగ్రెస్ నాయకులు తమ సొంత అనుచరుల ఇళ్ల ముందే రోడ్లు వేయించుకుంటున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు జరుగుతున్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులను, బీజేపీ నాయకులను కనీసం పిలవకపోవడం ప్రోటోకాల్ ఉల్లంఘన అని, ఎన్నికైన వార్డు మెంబర్లను కేవలం సంతకాలు పెట్టే డమ్మీలుగా మార్చారని స్థానిక యంత్రాంగం, అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. లచ్చమ్మగూడెంలో కక్షసాధింపు రాజకీయాలు నడుస్తున్నాయని, బీజేపీకి మద్దతుగా ఉన్న వార్డుల్లో కావాలనే సీసీ రోడ్ల పనులను తొక్కిపెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్న వార్డుల్లో మాత్రం రాత్రికి రాత్రి రోడ్లు వేసుకుంటున్నారని, “గ్రామం అంటే అందరిది, అది కాంగ్రెస్ పార్టీ జాగీరు కాదు అని హెచ్చరించారు. వార్డు మెంబర్ల అనుమతి లేకుండా, ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసమే ఈ నాసిరకం పనులు జరుగుతున్నాయని, రేపు మొదటి వర్షానికే ఈ రోడ్లు కొట్టుకుపోతే సమాధానం చెప్పేది ఎవరని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్ల కోసం ఎంత ఇచ్చింది, రాష్ట్ర ప్రభుత్వం వాటా ఎంత అనే అంశంపై రాబోయే రోజుల్లో గ్రామ సభలో బహిరంగ చర్చకు మేము సిద్ధం. కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులకు నిజంగా చేతనైతే ఎమ్మెల్యే, ఎంపీ నిధులు అదనంగా తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలే తప్ప, కేంద్ర నిధులను దోచుకుంటూ సొంత డబ్బా కొట్టుకోవడం సిగ్గుచేటని హితవు పలికారు.

# వనస్థలిపురంలో ఘనంగా ప్రపంచ మెకానిక్స్ దినోత్సవ వేడుకలు

### వనస్థలిపురం టూ వీలర్స్ మెకానిక్స్ అండ్ ఆటోమొబైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు




ఎల్బీనగర్, 3 జూలై : ప్రపంచ మెకానిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనస్థలిపురం ప్రాంతంలో టూ వీలర్స్ మెకానిక్స్ అండ్ ఆటోమొబైల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. వనస్థలిపురం టూ వీలర్స్ మెకానిక్స్ అండ్ ఆటోమొబైల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వనస్థలిపురం గురుద్వార్ రోడ్డులోని రామాలయంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మిత్ర బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన కార్యక్రమంలో మెకానికల్, కార్మికులు ఆటోమొబైల్స్ యజమానులు పాల్గొని తమ రక్తాన్ని దానం చేశారు. ఈ రక్తదాన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్తా లు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మెకానికల్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనస్థలిపురం టూ వీలర్స్ మెకానిక్స్ మరియు ఆటోమొబైల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మెకానికల్స్, కార్మికులు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, సెక్రటరీ మోహిన్, ట్రెజరర్ నరేందర్ రెడ్డి, సలహాదారులు దామోదర్ గౌడ్, ఆర్గనైజర్ దంటిక నరసింహ యాదవ్, సలహాదారుడు షరీఫ్, వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, శంకర్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్ల మల్ల కృష్ణారెడ్డి

సంస్థాన్ నారాయణపూర్ జూలై 03( వార్త మిర్రర్ ) నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఎన్టీవీ రిపోర్టర్ పాలకూర్ల యాదయ్య గౌడ్( సూర్య)– బాలమణి దంపతుల కుమార్తె జ్యోతిర్మయి – సతీష్ గౌడ్ నూతన దంపతుల వివాహ వేడుకలు శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్లమల్ల కృష్ణ రెడ్డి ఈ కార్యక్రమంలో ఎండి అక్బర్, రాచమల్ల యాదయ్య, చెక్క నరసింహ, బైకని నరేందర్, ఏపూరి శివయ్య తదితరులు పాల్గొన్నారు



## చేనేత సహకార సంఘం ఎన్నికలలో నామినేషన్ దాఖలు

సంస్థాన్ నారాయణపూర్ జులై0 3( వార్త మిర్రర్)రాష్ట్రవ్యాప్తంగా చేనేత సహకార సంఘాల ఎన్నికలలో భాగంగా నారాయణపురం చేనేత సహకార సంఘ ఎన్నికలలో కార్యవర్గ సభ్యుని పదవికి శుక్రవారం రోజు ఎన్నికల అధికారి కె.ప్రవీణ్ కుమార్ కు నామినేషన్లు దాఖలు చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుకూరి శ్రీనివాస్. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నారాయణపురం చేనేత సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పారిశ్రామికలందరికీ ప్రభుత్వం పరంగా వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైనంత వారందరికీ ఇప్పించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలుకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు



## ఓటరు జాబితా సవరణలో
## బీఆర్ఎస్ నాయకుల చురుకైన భాగస్వామ్యం
### ....తార్నాకలో ఇంటింటికీ వెళ్లి బీఎల్ఓ ఫారాల పంపిణీ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 3 : ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ సూచనల మేరకు తార్నాక డివిజన్లో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు జింకల మల్లేష్ బీఎల్ఓ ఫారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.డివిజన్లోని బూత్ నంబర్--219 పరిధిలో బీఎల్ఓ లోహితతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలను అందజేశారు. ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు నమోదు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను ధృవీకరించుకోవడం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందేందుకు సహకరించాలని జింకల మల్లేష్ కోరారు.



## యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు మేంబర్ గా ఎన్నికైన ఈశ్వరమ్మ యాదవ్ కు సన్మానం
### ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి- పగిడిమర్రి శ్రీనివాస శర్మ

వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరోయాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి ట్రస్ట్ బోర్డు మెంబర్ గా ఎన్నికైన ఈశ్వరమ్మను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు బ్రహ్మశ్రీ పగిడిమర్రి శ్రీనివాస శర్మ వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రంగా అద్భుత శిల్పాకళల దివ్య క్షేత్రంగా పేరుగాంచిన యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో అక్కనపల్లి వీరయ్య, చెన్నప్ప, ఈశ్వరమ్మ కుమారుడు కృష్ణ యాదవ్ తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలోనే వజ్రా లాంటి విద్యార్థులు ఉంటారు -సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి

### - రిలయంబుల్ ట్రస్ట్ అందిస్తున్న సహకారం అభినందనీయం- ఎంఈఓ జి. శ్రీనివాస్
### - సామాజిక మాధ్యమాలను మంచి కోసం వినియోగించాలి- ఎస్ ఐ జగన్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే వజ్రా లాంటి విద్యార్థులు ఉంటారని సంస్థాన్ నారాయణపురం సర్పంచి ఉప్పల విజయలక్ష్మి– లింగస్వామి తెలిపారు.రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురంలోని బాలుర బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ సమకూర్చిన రూ.3 లక్షల విలువైన 'స్టూడెంట్స్ కిట్స్', స్పోర్ట్స్ కిట్స్ లను తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పోలీస్ ఎస్ఐ జగన్ ఎంఈఓ శ్రీనివాస్ లతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ, మట్టిలో మాణిక్యాల మరుగున పడిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రిలయబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చినందుకు అభినందించారు. ఎంతో ప్రతిభ, బోధనా అనుభవం ఉన్న ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని విద్యార్థులను



సాన పెట్టి విలువైన వజ్రాల తీర్చిదిద్దాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి అపారమైన మేధస్సు ఉంటుందని, దాన్ని ఉపయోగించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఎస్ఐ జగన్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యమని అన్నారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయకూడదని, మంచి కోసం వినియోగించాలని సూచించారు.

### రిలయబుల్ ట్రస్ట్ సహకారం అభినందనీయం: ఎంఈఓ

రిలయబుల్ ట్రస్ట్ అందించిన సహకారం విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని సంస్థాన్ నారాయణపురం ఎంఈఓ జి శ్రీనివాస్ తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గుజ్జ గ్రామాల్లోని జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిలయబుల్ ట్రస్ట్ సమకూర్చిన స్టూడెంట్స్ కిట్స్ ను ఆయన చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్న ప్రోత్సహించడానికి రిలయబుల్ ట్రస్టు ద్వారా గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందించినందుకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీలు తుపాకుల రవి, సత్యానందములకు కృతజ్ఞతలు తెలిపారు. గుజ్జ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ట్రస్టు ప్రతినిధి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# రమేష్ చంద్ జిందాల్ సౌజన్యంతో అనాధ పాఠశాలలో అల్పాహార వితరణ

### - మా సమితి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి- డా, కపిల్ కుమార్ అగర్వాల్

వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరోవనస్థలిపురంలో కృష్ణ గోపాల్ సేవాసమితి ఆధ్వర్యంలో రమేష్ చంద్ జిందాల్ గారి సౌజన్యంతో అనాధ పాఠశాల విద్యార్థులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ మా కృష్ణ గోపాల్ సేవ సమితి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అనుకున్న ప్రతి ఒక్కరు మీ జన్మదిన, వివాహ వార్షికోత్సవం, ఇతర ఏ శుభకార్యాలు ఉన్న సేవా సమితి ని సంప్రదించి అనాథల ఆకలి తీర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్, సమితి సభ్యులు పాల్గొన్నారు



# అయోధ్య శ్రీరామ పాదుకలతో తార్నాకలో ఆధ్యాత్మిక సందడి

### ....పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. ప్రత్యేక పూజలు, హారతులు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 3: అయోధ్య శ్రీరాముని పవిత్ర పాదుకలు, బాల అయోధ్య రాముడు, శ్రీరాముని ధనస్సు తార్నాకలోని ఆత్మీయ మహిళా మండలి ప్రాంగణానికి చేరుకోవడంతో ఆ ప్రాంతం భక్తిమయ వాతావరణంతో కళకళలాడింది. చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీరాముని పాదుకలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీరామ పాదుకలకు విశేష పూజలు, హారతులు సమర్పించగా ప్రాంగణమంతా ఆధ్యాత్మిక



శోభతో మార్మోగింది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు శ్రీరాముని ఆశీస్సులు పొందుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అయోధ్య నుంచి తీసుకొచ్చిన పవిత్ర పాదుకల దర్శనం తమకు అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు చల్లా శ్రీనివాస శాస్త్రి, ఆత్మీయ మహిళా మండలి అధ్యక్షురాలు, కవయిత్రి డాక్టర్ లక్కరాజు నిర్మల, కొండపల్లి నరసింహారావు మాట్లాడుతూ శ్రీరామ భక్తి, సనాతన ధర్మ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భక్తులు, సేవా బృంద సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ట్రినిటీ స్కూల్ ఎదుట అఖిలపక్ష

### విద్యార్థి, యువజన సంఘాల భారీ ధర్నా -- నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 03

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని ఒకే ప్రభుత్వ అనుమతితో మూడు పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ట్రినిటీ స్కూల్ ముందు అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ విద్యా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అక్రమంగా నడుస్తున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ,పల్లె మధుకృష్ణ, దిండు భాస్కర్, కొండూరు వెంకన్న, పబ్బు వంశీ,బండిగారి శ్రీధర్,తిగుళ్ల శ్రీను, రాఘవ, రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థలపై పర్యవేక్షణ పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా లేదా ఒకే అనుమతితో అనేక పాఠశాలలను నిర్వహించడం చట్టవిరుద్ధమని, అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ఉండటం అత్యంత బాధాకరమన్నారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలు అన్నింటినీ పక్కనబెట్టి కొందరు యాజమాన్యాలు వ్యాపార ధోరణితో విద్యను నడుపుతున్నాయని ఆరోపించారు.గత కొంతకాలంగా చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేని పాఠశాలలు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాలు వరుసగా పోరాటాలు చేస్తున్నాయని గుర్తు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ధర్నా శాంతియుతంగా కొనసాగుతున్న సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని ఉద్యమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని నాయకులు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ప్రజాస్వామ్య హక్కుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం, సమస్యను పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం ఉద్యమకారులపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యాశాఖ అధికారులు వెంటనే ట్రినిటీ స్కూల్తో పాటు చౌటుప్పల్ మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల అనుమతులు,



గుర్తింపు పత్రాలు, మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లు, ప్రభుత్వ నిబంధనల అమలుపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని, అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యాలను కాపాడడం కాదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చట్టబద్ధమైన చర్యలు తీసుకోకపోతే అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఉద్యమాన్ని విస్తరించి మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో కొప్పు రామకృష్ణ, కొల్లూరు నవీన్, రాకేష్, గంగాదేవి శివ, వాలీ, అశోక్, సన్నీ, హరీష్, మనోజ్, ప్రణయ్, మరియు అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు..